
# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

# నందమూరి తారక రామారావు

## (కినిమా 1952, సెప్టెంబర్ సంచిక నుంచీ)



"పెళ్లిచేసి చూడు"లో

"పాతాళ భైరవి" నాయకుడు తోటరాముడుగా యావదాంధ్రకేగాక, యావద్భారతానికీ, అంతర్జాతీయ సినిమా ఉత్సవాల ద్వారా విదేశీయ సినిమా ప్రతినిధివర్గాలకూ పరిచయం అయిన నందమూరి తారక రామారావు (మీ ఎన్.టి.రామారావు) 1923 జూన్ 15 న గుడివాడ తాలూకా నిమ్మకూరు గ్రామంలో పుట్టాడు.

జూన్ లో పుట్టినవారు "తెలివైన నటులూ, లాయర్లూ, ఉపన్యాసకులూ, జీవిత నాటకంలో మారుతూవుండే పాత్రలు ధరించేవారూ అవుతారు" అని చెబుతారు. వీరిని అర్థం చేసుకోవటం చాలా కష్టం. వీరి మనసులు అతి చురుకుగా వుండి, శత్రువులకు అందుకోరానివిగా ఉంటాయి. ఈ నెలలో పుట్టినవారికి పైకిరావాలనే ఆశ వుంటుందిగాని ఒక స్థాయికి చేరుకునే లోపుగానే దానిమీద విరక్తి కలుగుతుంది. వీరి ముఖాలు కోలగా వుంటాయి, కళ్ళు అందంగా, చురుకుగా వుంటాయి. వీరికి మిత్రులెక్కువగా వుంటారు. తత్కాలానికి తమ మనసులో మెసిలే మనిషికి వీరు విరివిగా సహాయం చేస్తారు. వీరికి వేగం ఇష్టం. ఈ లక్షణాలలో చాలాభాగం రామారావులో మనం చూడవచ్చు.

రామారావు తండ్రి లక్ష్మయ్య గారు, తల్లి వెంకట రామమ్మ గారు, వారిది రైతువంశం. నిమ్మకూరులో వారి కుటుంబానికి రెండు పెద్ద లోగిళ్ళూ, సుమారైన భూవసతీ వుంది. ఈ నందమూరి వారిలో ఆడపిల్లలు అరుదుగా కనిపిస్తుంది. రామారావుకు మేనత్తలుగాని, అక్కచెల్లెళ్ళుగాని కుమార్తెలు గాని లేరు. అతనికి రామకృష్ణ, జయకృష్ణ అని ఇద్దరు కుమారులున్నారు.

రామారావు తండ్రిగారివద్ద పెరగలేదు. పెత్తండ్రి రామయ్య గారు అతన్ని పెంచి పెద్దచేశారు. రామయ్యగారు విలాస పురుషుడు, దర్జాగా బతికేవాడు. తెల్లబట్ట మాయటానికి వీల్లేదు. "షోకు రామయ్య" గారంటే ఆ ప్రాంతాల అందరికీ తెలుసు. ఆయనే రామారావును పెంచి, పెద్దచేసి, చదువు చెప్పించారు.

రామారావు చదువు నిమిత్తం పదోయేట స్వగ్రామం వదిలిపెట్టి బెజవాడ చేరాడు. ఈ విద్యార్థి దశలో రామారావును చూసినట్టయితే మనకు "పాతాళభైరవి" లోని తోటరాముడు తప్పక స్ఫురిస్తాడు. ఖాకీ లాగూ, చొక్కా ధరించి పాత హెర్క్యులిస్ సైకిల్ మీద సవారి చేసేవాడు. గోదాలోపడి బస్కీలు తీసేవాడు. శరీరం మీద తప్ప మరి దేనిమీదా ధ్యాసలేదు. ఎవరితోనో ఒకరితో పోట్లాడనిరోజు దుర్దినం అది తన పోట్లాటే కానక్కర్లేదు.

కాని ఈ "బండ" అవతారం వెనక ఏదో కళాతృష్ణ దాగివుంది. అతనికి బొమ్మలు వెయ్యాలనే వెర్రి మహావుండేది. బొమ్మలు బాగా వేసేవాడు కూడానూ. 1941-42 లో బెజవాడలో జరిగిన ఆంధ్రరాష్ట్ర విద్యార్థివైజ్ఞానిక మహాసభలలో "రైతు బంధన" అన్న ఇండియన్ ఇంక్ చిత్రానికి ప్రథమ బహుమతి వచ్చింది. ఈ చిత్రంలో ఒక పక్క బంధించిన రైతువుంటాడు. అతడికి యెదురుగా పెద్ద బొర్రవేసుకొని, యికిలిస్తూ జమీందారుంటాడు, రైతు పరికరాలు నేలపై చెల్లచెదురుగా పడివుంటాయి. ఈ చిత్రం రచించినది రామారావు... రామారావు హస్తనైపుణ్యం సాటి విద్యార్థులెరుగుదురు. వారు తమ నోటు పుస్తకాల మీద అతనిచేత తమపేర్లు రాయించుకుంటూ ఉండేవారు.

ఎన్ని యితర గొడవలున్నప్పటికీ రామారావుకు నాటకాల గొడవమటుకు లేదు. "షోకు రామయ్య" గారు స్టేజి మీద వేషాలు వేసేవాడు. ఆయన నుంచి అయినా రామారావుకు నాటకాలపిచ్చి అబ్బింది కాదు. కాని రామారావు యింటర్ చదువుతూవుండగా నాటకంలో వేషం కట్టవలిసిన పరిస్థితి ఏర్పడింది. దీనికి కారకులు మరెవరో కాదు, కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు.

విశ్వనాథవారు తమ కాలేజిపిల్లల చేత ఆడించటానికని "రాచమల్లుని దౌత్యం" అనే నాటిక వ్రాశారు. అందులో నాగమ్మ (నాయకురాలు) పాత్రను రామారావు వెయ్యాలని పట్టుబట్టారు. మొదట రామారావు నిరాకరించాడు, కాని కవిసమ్రాట్ గారి "అక్షింతలు" కొన్ని పడ్డాక ఒప్పుకున్నాడు తాను మీసంతీయకుండా నాగమ్మ వేషం ధరించే షరతుతో :... ఆ ప్రదర్శనం గురించి మనం ఇవాళ తెలుసుకోగలిగిందల్లా యేమంటే_రామారావును తోటి విద్యార్థులు చాలాకాలం "మీసాల నాగమ్మ" అని పిలిచారు. ఈ వేషానికి రామారావుకు రెండవ బహుమతి వచ్చింది.

ఈ బహుమానం పుచ్చుకున్నాక "కోటా" రంగు వాసన రామారావు నరాలకు బలంగా యెక్కినట్టు కనిపిస్తుంది. అతను ఏపని కూడా సౌమ్యంగా చెయ్యలేదు. ఇంటర్ రెండోయేడు ఆరంభిస్తూనే కాలేజి నాటకసంఘానికి ఉపాధ్యక్షుడుగా పోటీ చేసి, నెగ్గి నాటకాలపిచ్చిలో పడ్డాడు. ముద్దుకృష్ణగారి "అనార్కలీ" ఆడించి, అందులో సలీంపాత్ర ధరించాడు. ఆ నాటకం యెంతో విజయవంతమై, మళ్ళీ ఆడవలసివచ్చింది. ఈ సంవత్సరమే అతని వివాహం కూడా జరిగింది. సంవత్సరాంతాన అతను పబ్లిక్ పరీక్షకు కూర్చుని తప్పాడు. 1942 మార్చి లగాయితు 1945 మార్చి దాకా అతను ఇంటర్ పరీక్ష నెగ్గనే లేదు. "పెళ్ళి అయిపోయింది యింక చదువు సాగదు" అన్నారు. కాని రామారావు వదిలే రకం కాదు. 1945 లో ఇంటర్ పూర్తి చేసి బి.ఎ. చదవటానికి గుంటూరు వెళ్ళాడు.

1942 మొదలు 1945 వరకూ రామారావుకు నాటకాల స్పర్శ కూడా పోయింది. కాని తిరిగి కాలేజీలో చేరగానే మళ్ళీ నాటకాలు ఆరంభమయాయి. "నాయకురాలు" నాటకంలో రామారావు "నలగామ రాజు" పాత్ర ధరించగా నాగమణిగారు (శ్రీరంజని భర్త) చూడటం తటస్థించింది. ఆయన ద్వారా రామారావును గురించి సి.పుల్లయ్య గారికి తెలిసింది. ఆయన రామారావు ఫోటోలూ అవీ చూసి తృప్తి పడి, తాము తయారు చేయనున్న "వింధ్యారాణి" చిత్రంలో "శివశ్రీ" పాత్ర ధరించమని కోరారు. ఇది 1946 డిసెంబరులో రామారావు బి.ఎ.

పరీక్షకు తయారవుతూ వుండగా జరిగింది. బి.ఏ. డిగ్రీ తెచ్చుకోవాలన్న పంతం మీద రామారావు చదువు నిలపటానికి సమ్మతించలేదు. (తదుపరి శివశ్రీ పాత్రను రమణారావుకిచ్చారు.)

రామారావు సినిమా నటుడి జీవితానికి బీజం ఎప్పుడు పడిందీ చెప్పటం కష్టం. ఇటువంటి చిక్కే యితర సినిమా నటుల జీవితాలలోనూ కనిపిస్తుందేమో మరి. 1947 ఏప్రిల్ 11 న రామారావు పరీక్షలు అయిపోయాయి. అతను బెజవాడకు తిరిగి వెళ్ళాడు. ఏప్రిల్ 14 న డైరెక్టర్ ప్రసాద్ గారు బెజవాడలో ఉన్నారు. ఆ రాత్రి దాదాపు అర్ధరాత్రివేళ దుర్గాకళామందిరంలో ప్రసాద్ గారు "రైతుబిడ్డ" చిత్రం ప్రైవేటుగా వేసుకొని చూసుకుంటూ వుండగా రామారావు ఆయనకు పరిచయం చేయబడ్డాడు. ఆ అపరాత్రి వేళ డైరెక్టర్ ప్రసాద్ కు రామారావును దీక్షగా పరిచయం చేసిన వ్యక్తి స్టిల్స్ తీసే మణ్యంగారు.

రామారావును చూస్తూనే డైరెక్టర్ ప్రసాద్ గారు అతనికి సినిమాలో మంచి భవిష్యత్తు వున్నదని గ్రహించినట్టు కనిపిస్తుంది. 1947 మే నెలలో రామారావు మద్రాసు చేరాడు. అప్పట్లో సారథీ ఫిలిమ్స్ వారు "శ్రీమతి" అనే చిత్రం తీద్దామనుకుంటున్నారు. వారు శోభనాచల స్టూడియోలో రామారావుకు టెస్ట్ తీయించారు. "శ్రీమతి" చిత్రం తీసే ప్రయత్నం విరమించుకోబడింది. కాని ఎం. ఆర్. ఏ. వారు తీద్దామనుకుంటున్న "మనదేశం" చిత్రంలో పోలీసు అధికారి పాత్రకు రామారావు బుక్ అయినాడు. అయితే ఆ చిత్రం 1947 లో ప్రారంభమే కాలేదు.

తిరిగి 1948 జనవరిలో రామారావు మద్రాసుకు వచ్చి "పల్లెటూరి పిల్ల" లో "జయంత్" పాత్రకు బుక్ అయినాడు. 1949 లో "సంసారం" లో "రఘు" పాత్రకూ. "మాయారంభ" లో "నలకూబరుడు" పాత్రకూ, విజయావారి "షావుకారు" లో "సత్యం" పాత్రకూ బుక్ అయినాడు. "షావుకారు" లో నటిస్తూ ఉండగానే రామారావు విజయ వారి పర్మనెంట్ ఆర్టిస్టు అయి "పాతాళ భైరవి" లోనూ, వాహినీ వారి "మల్లీశ్వరి" లోనూ, విజయ వారి "పెళ్ళి చేసి చూడు" లోనూ నటించాడు.

సినిమా నటుడుగా రామారావును ఈనాడు అందరూ ఎరుగుదురు, అతన్ని అంచనా కట్టటం కూడా ఏమంత కష్టంకాదు.

రామారావుది చాలా అందమైన విగ్రహం. మొదట్లో కొంచెం స్థూలంగానూ, మొరటుగానూ ఉన్నాడనిపించేది గాని రాను రాను చాలా నాజూకుగా, నేవళంగా తయారైనాడు. ఇవాళ తెలుగు తెరమీద రామారావుకన్న ఆకర్షవంతమైన వ్యక్తి లేడంటే అతిశయోక్తి కాదు. అతని నటన పాత్రకు "చాల లేదు" అన్న విమర్శ ఎన్నటికీ కలగదు. అతను అవసరమైన దానికన్న కాస్త యెక్కువే నటిస్తాడుగాని తగ్గడు. అందుచేత డైరెక్టరుకు అతన్ని ఉపయోగించుకోవటం సులభం; తనకు కావలిసిన మోతాదులో రామారావుచేత నటింపజేయవచ్చు. అతనిలో "కదలిక" కూడా బాగావుంది. రామారావు కేవలం ప్రేక్షకుల దృష్టిలోనే కాక, చిత్ర నిర్మాణానికి యివతలవైపున వుండే వారిదృష్టిలో కూడా చాలా తృప్తికరమైన నటుడు. అతన్ని ఫోటోగ్రాఫ్ చెయ్యటంలో కామెరామాన్ కు గాని. అతని గొంతు రికార్డు చెయ్యటంలో రికార్డిస్టుకుగాని ఈషణ్మాత్రమైనా ఇబ్బందిలేదు.

సినిమా నటుడుగా రామారావును గురించి ఒక్క విషయం విశేషం కింద చెప్పుకోవచ్చు. "ప్లేబాక్" పాటలు పాడే వారందరిలోకీ హెచ్చుగా భావోద్రేకంతో పాడగల వ్యక్తి ఘంటసాల. ఆయన పాడిన పాటలకు చాలామంది పెదవులు కదిలించారు. కాని ఘంటసాల పాటలోగల భావానికి తూగేలాగు నటించగల నటుడు ఒక్క రామారావే కనిపిస్తాడు. అతని భావప్రకటనా సామర్థ్యానికి ఘంటసాల పాటలే గీటురాయి. "షావుకారు" , "పెళ్ళిచేసిచూడు", "మల్లీశ్వరి" చిత్రాలలో రామారావు అభినయించిన ఘంటసాల పాటలు ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకోండి.

తన నటన జయప్రదం అయినందుకు రామారావు తన ప్రతిభ ఎంతవరకు కారణమంటాడు? "నటుడి నటనకు ప్రాముఖ్యం చాలా తక్కువ. అసలు ప్రాముఖ్యత డైరెక్టరుది, కథది" అంటాడు రామారావు. ప్రతిభావంతులైన నటులు అన్ని చిత్రాలలోనూ ప్రకాశించరేమని అతని

సవాలు. ఎవరి నటనగాని విజయవంతమయిందా, కాలేదా అన్నదానికి రుజువేమిటి? "ప్రజాభిప్రాయమే", అంటాడు రామారావు. ఇంకొక రుజువులో అతనికి విశ్వాసం లేదు.

రామారావు ప్రజలపై అపారవిశ్వాసం కలవాడు. కళ యావత్తూ ప్రజలదేనని అతని వాదన. ఈనాటి సినిమా ప్రరిశ్రమ లోపభూయిష్ఠంగా ఉందని అతను ఒప్పుకుంటాడు. కాని ఈ లోపాలు కొద్దిమంది విమర్శకులద్వారాగాని, చిత్ర నిర్మాణంలో ఉన్నవారి పరివర్తనవల్లగాని చక్కబడతాయని అతనికి నమ్మకం లేదు. "ప్రజలే ఈ పరిశ్రమని సంస్కరించాలి" అని అతని దృఢవిశ్వాసం.

నటుడి ధర్మాలను నిర్ధారణ చెయ్యటంలో రామారావు భావవాది ఎంతమాత్రం కాదు. పొట్టగడవని స్థితిలో కళాకారుడు ఎటువంటి అవకాశాన్ని చేపట్టినా తప్పులేదు; కాని దారిద్ర్య సమస్య తీరిన అనంతరం నటుడు తన కళాధర్మాన్ని త్యజించరాదు. తనకు లభించే అవకాశాలలో సరియయిన వాటినే స్వీకరించి కళాధర్మాన్ని కాపాడుకోవాలి" అని రామారావు మతం.

ఇటీవల రామారావు "ఆంధ్రప్రభ రాయలసీమ క్షామ నివారణ నిధి"కి వసూళ్ళు చేస్తూ ఒక నెలపాటు ఆంధ్ర యావత్తూ పర్యటించి నాటకాలాడటం అందరికీ తెలిసిన విషయమే. ఈ పర్యటనలో అతను తన విశ్వాసాలను అమలులోకి తీసుకురావటమే గాక, కొన్ని కొత్త విషయాలు నేర్చుకున్నాడు.

రామారావు ఎన్నడూ రాజకీయాల జోక్యానికి పోయిన వాడు కాదు. ఏ ఉద్యమాలలోనూ పాల్గొన్న వాడు కాదు. అటువంటి వాడు రాయలసీమ క్షామం సందర్భంలో ఎందుకీ విధంగా కదలాలి? ప్రజలసమస్య తీవ్రస్వరూపములో సాక్షాత్కరించినప్పుడు ఏ కళాకారుడూ ఆ సమస్యకు దూరంగా ఉండరాదని రామారావు మతం. ఇటువంటి సందర్భాలలో పృథ్వీరాజు పూర్వం ఎట్లా కదిలిందీ రామారావు గమనించి ఉన్నాడు. పృథ్వీరాజు ఒక దేవుడని భావించి ఉన్నాడు. రాయలసీమ క్షామ సమస్య తన సమస్య చేసుకొని, సర్కారాంధ్రుల సమస్యగా చేయటానికి అతను ఉపక్రమించాడు. తన నేషనల్ ఆర్ట్ థియేటర్ ను పైకి తీసి, జి.వరలక్ష్మి, బాలకృష్ణ, పేకేటి శివరాం, ఎం.ఎస్.రామారావు మొదలైన సినిమాకారుల సహకారం స్వీకరించి ప్రజలలో ఒకడుగా ప్రజలమధ్యకి వెళ్ళి అఖండ విజయంతో, తిండికి మాడే రాయలసీమ వాసుల కొరకు లక్షరూపాయలు పోగుచేసి మద్రాసు చేరుకొన్నాడు.

ఈ నేషనల్ ఆర్ట్ థియేటర్ గురించి ఒక్క ముక్క చెప్పాలి. రామారావు యీ సంస్థను తన బంధుమిత్రుల సహాయంతో 1946 లో, గుంటూరులో బి.ఎ. చదువుతూ ఉండగా, నెలకొల్పాడు. దీని నిర్వాహకులు పి.ఎల్.నారాయణ గారు. రామారావు బావమరిది పుండరీకాక్షయ్య గారు యిందులో వొక నటుడు. 1947 లో బెజవాడలో శాంతారాం అధ్యక్షత కింద జరిగిన 14 వ ఆంధ్ర నాట్యకళా పరిషత్తులో ఈ కంపెనీ వారు కొప్పరపు సుబ్బారావుగారి ఏకాంకిక "చేసిన పాపం" ప్రదర్శించి షీల్డ్ బహుమతి పొందారు. ఈ నాటికలో రామారావు "బౌద్ధభిక్షువు" పాత్ర ధరించాడు. రామారావు సినిమాలలో ప్రవేశించిన అనంతరం కూడా ఈ సంస్థ పనిచేస్తూనే వచ్చింది. ఇందులో నటించిన వారిలో కె.జగ్గయ్య, సావిత్రి కాలక్రమాన సినిమారంగంలో కూడా ప్రవేశించారు.

క్షామ నివారణ నిధి పర్యటన సందర్భంలో రామారావు నేర్చుకొన్న విషయమేమిటంటే, సినిమా నటుడుగా ప్రజల వద్దకు వెళ్ళినదానికీ, ప్రజలలో ఒకడుగా వెళ్ళినదానికీ ఎంతో తేడావుందని. "మేము పాతాళ భైరవి శతదినోత్సవాల సందర్భంలోనూ, జూబిలీ సందర్భంలోనూ సినిమా నటుల హోదాతో ప్రజల దగ్గరికి వెళ్ళాము. మాకు ముందూ, వెనుకా కూడా పోలీసు బందోబస్తు కావలిసి వచ్చింది. ప్రజలు మామీద దొమ్మిచేశారు. మమ్మల్ని కిరాయి వ్యక్తులల్లే పాటలు పాడమన్నారు. ఈ సారి బిచ్చగాళ్ళుగా ప్రజలదగ్గరికి వెళ్ళాము. ఒంటి ఆడకూతురు వరలక్ష్మి నడివీధిలోకి జోలెపట్టుకు వచ్చింది. మాకు ఏ బందోబస్తూ లేదు. మమ్మల్ని ఎవరూ దొమ్మీ చేయలేదు. తృణమో పణమో ఇచ్చారు. మమ్మల్ని తమ ఆప్తులుగా చూసుకున్నారు. మామీద తమకుగల గౌరవానురాగాలు చూపారు" అన్నాడు రామారావు. ఇది ప్రతి కళాకారుడూ నేర్చుకోదగిన పాఠమేననటానికి సందేహం లేదు.

రామారావు స్టేజిని కళానిలయంగానే ఆరాధించాడు. తాను స్టేజిమీద వేసిన యే వేషానికీ ఒక దమ్మిడీ యెన్నడూ పుచ్చుకోలేదు. నటించటంలో కలిగే సంతృప్తి స్టేజిమీద కలిగినట్టుగా సినిమారంగంలో కలగదంటాడు రామారావు. అంతమాత్రం చేత అతనికి సినిమా నటనపై ఆదరం లేదని కాదు.

రామారావు ప్రస్తుతం రాజ్యం పిక్చర్స్ వారి "దాసి"లో "బండిరామయ్య" గానూ, కృష్ణాపిక్చర్స్ వారి "అమ్మలక్కలు" లో "కుమార్" గానూ, పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్ వారి "పల్లెటూరు" లో "చంద్రం" గానూ, విజయవారి "చంద్రహారం" లో "చందన్" గానూ, ఏ.వి.ఎం. వారి "గర్ ర్." లో "రాజా" గానూ, యింకా భరణీవారి "చండీరాణి" లోనూ నటిస్తున్నాడు. సినిమా నటుడుగా రామారావుకు మంచి భవిష్యత్తువున్నది. నానాటికీ అతను మెరుగు తేరుతున్నాడు. అతని విశ్వాసాలుకూడా అతని పురోభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయిగాని ప్రతికూలంగా ఎంతమాత్రమూ లేవు.

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS